నేటి నుంచి ఖేలో భద్రాద్రి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 14 : ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు ఖేలో భద్రాద్రి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా సంబురాలు జరుగనున్నాయని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, జిల్లా కార్యదర్శి కంచర్ల సాయిభార్గవ చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం నాయకత్వం వహించనున్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని పోటీలను ప్రారంభిస్తారని, చివరిరోజు 17వ తేదీన బహుమతి ప్రదానోత్సవం కలెక్టరేట్‌లో జరగనుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 14 : కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.రఘు రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న టి.శేషాంజనేయస్వామిని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌గా ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ బుధవారం నియమించారు.

కనకదుర్గ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పాల్వంచ, ఫిబ్రవరి 14 : కేటీపీఎస్‌లోని ఏడో దశ కోల్‌ప్లాంట్ వద్ద శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. టీఎస్ జెన్కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య దంపతులు పూజలు చేశారు. సీఈ వెంకటేశ్వరరావు దంపతులు, ఎస్ఈలు రాజ్‌కుమార్, నాగరాజు, అస్సాజ్, రాజశేఖర్, హరిలాల్, శ్రీనివాసరావు, రాంబాబు, బలరాం, మంగీలాల్, రవీందర్ నాయక్, కిశోర్, ఏడీఈ వెంకటేశ్వర్లు, రవి, జి.శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, శ్యాం సుందర్‌రావు, ఇంజినీర్లు, సీహెచ్ రమేశ్, ఎండీ మజీద్, రాధాకృష్ణ, బ్రహ్మాజీ, మంగీలాల్, జాదవ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 14 : మండలంలోని శ్రీనగర్‌కాలనీలోని 5వ లైన్‌లో నివాసం ఉంటున్న శారద బుధవారం ఉదయం 6గంటలకు ఇంటి ముందు వాకిలిని శుభ్రం చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని మూడుతులాల బంగారు గొలుసును లాక్కెళ్లి పరాయ్యాడు. బాధితురాలు లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

హోమియో వైద్య శిబిరం

పర్ణశాల, ఫిబ్రవరి 14: దుమ్ముగూడెం మండలంలోని సీతానగరంలో బుధవారం హోమియో వైద్య శిబిరాన్ని పర్ణశాల పీహెచ్‌సీ హోమియోపతి వైద్యుడు రాజేష్‌బాబు నిర్వహించారు. వైద్య సిబ్బంది మహబూబ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

టేకులపల్లి, ఫిబ్రవరి 14: కోయగూడెం ఉపరితల గనిలో గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కేవోసీ పీవో ప్రహ్లాద తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉపరితలగనిలో బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు ప్రజా అభిప్రాయ సేకరణ ప్రాజెక్టు ఆఫీస్ సమీపాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
కావలెను
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోలీస్ అధికారుల పోస్టింగుల్లో గందరగోళం!

బదిలీ అయిన డీఎస్పీల స్థానాల్లో మార్పు

జిల్లాలో ఇద్దరు డీఎస్పీలకు యథాస్థానం

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 14 : పోలీస్ పోస్టింగుల్లో గందరగోళం నెలకొన్నది. రెండ్రోజుల క్రితం వచ్చిన బదిలీల లిస్టును మళ్లీ మార్పు చేస్తూ డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కేవలం రెండ్రోజుల్లోనే విడుదలైన ఆర్డర్స్‌ని రద్దు చేస్తూ కొందరు అధికారులను యథాస్థానంలో కొనసాగించడంపై పలురకాల చర్చలు జరుగుతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా బదిలీ అయిన డీఎస్పీల స్థానాలు యథావిధిగా కొనసాగడం వెనుక మతలబు ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 110మంది డీఎస్పీల బదిలీలు జరిగాయి. అందులో భాగంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడుగురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈక్రమంలో హైదరాబాద్‌లో సీసీఎస్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న లింగనబోయిన ఆదినారాయణకు పాల్వంచ డీఎస్పీగా బదిలీ కాగా, పాల్వంచలో విధులు నిర్వర్తిస్తున్న ఎన్.వెంకటేశ్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రహమాన్‌ను వరంగల్ జిల్లా మామునూరను ఏసీపీగా బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో ఇల్లెందు డీఎస్పీగా విధులు నిర్వర్తిన్న ఎస్‌వీ రమణమూర్తిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో పాల్వంచ డీఎస్పీగా ఎల్.ఆదినారాయణ బుధవారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. ఇంతలోనే సాయంత్రానికి మళ్లీ డీజీపీ కార్యాలయం నుంచి మళ్లీ బదిలీల ఉత్తర్వులు వచ్చాయి. అందులో కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్‌ను, పాల్వంచ డీఎస్పీ ఎన్.వెంకటేశ్‌ను యథావిధిగా కొనసాగడంతోపాటు, డీఎస్పీ ఆదినారాయణను సైతం తిరిగి హైదరాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇల్లెందు డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ కొత్తగూడేనికి బదిలీ అయిన రమణమూర్తి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌లో సైతం మార్పు చేస్తూ ఆయనను ఖమ్మం టౌన్ ఏసీపీగా నియమించింది ప్రభుత్వం. అదేవిధంగా మణుగూరు డీఎస్పీగా హైదరాబాద్‌లోని మెట్‌పల్లి ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న వంగా వెంకటరెడ్డిని నియమిస్తూ, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావుని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ఈ బదిలీల ప్రక్రియలో జరిగిన గందరగోళంపై పలు విమర్శలు వెలువడుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఈ బదిలీలైనా కొనసాగుతాయా..? లేక మళ్లీ మార్పులు జరుగుతాయా..? వేచి చూడాల్సిందే.

ముష్టిగింజల సాగు వివరాలు ఇవ్వాలి

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 14: జీసీసీ టర్నోవర్‌కు సంబంధించిన ఇన్‌కం ట్యాక్స్, జీఎస్టీ వివరాలతో పాటు ముష్టి గింజలు ఎక్కడెక్కడ పండుతున్నాయో సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని మేనేజర్లను ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. ఆయన బుధవారం తన చాంబర్‌లో జీసీసీ మేనేజర్లతో సమావేశమయ్యారు. జీసీసీ బ్రాంచీల పరిధిలోని సొసైటీల ద్వారా అటవీ ఫలాలు, ముష్టిగింజల సేకరణపై సర్వే, ఆశ్రమ పాఠశాలలు-వసతి గృహాలకు సరఫరా చేస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని విద్యాసంస్థలు-వసతి గృహాలకు నాణ్యమైన సరుకులను మాత్రమే సరఫరా చేయాలని, వాటికి సంబంధించిన వివరాలన్నిటినీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఫలాలను దళారులు దోచుకోకుండా నేరుగా జీసీసీకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల నుంచి కొన్న వాటికి వెంటనే పైకం చెల్లించాలన్నారు. నిధులు లేనట్లయితే ప్రభుత్వానికి నివేదించి, తెప్పించుకోవాలని అన్నారు. ముష్టి గింజలను గిరిజనుల నుంచి తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్నారు. అశ్వారావుపేట, వినాయకపురం, పాల్వంచలో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ వచ్చినందున వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. పనులు కూడా త్వరలోనే ప్రారంభించాలన్నారు. సమావేశంలో అధికారులు డేవిడ్ రాజ్, విజయకుమార్, మణెమ్మ, భాస్కరన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అధికారులు

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఆర్‌డీవో విద్యాచందన

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల పలువురు ప్రభుత్వ అధికారుల బదిలీలు జరిగాయి. జిల్లాకు బదిలీపై వచ్చిన అధికారులు వారివారి కార్యాలయాల్లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీఆర్డీవోగా విద్యాచందన, జిల్లా సహకార అధికారిగా సయ్యద్ ఖుర్షీద్, జిల్లా పంచాయతీ అధికారిగా చంద్రమౌళి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు కలెక్టర్ ప్రియాంక ఆలను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

జూలురుపాడు ఎంపీడీవోగా డి.కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వరరావు బదిలీపై కరకగూడెం వెళ్లగా వైరా ఎంపీడీవోగా పనిచేస్తున్న కరుణాకర్‌రెడ్డి ఇక్కడికి వచ్చారు. చుంచుపల్లి ఎంపీడీవోగా అశోక్ బాధ్యతలు స్వీకరించారు. లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవోగా బీవీ చలపతిరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సకినాల రమేశ్ బదిలీ కాగా ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టారు. జూలురుపాడు తహసీల్దార్‌గా స్వాతి బిందు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శారద బదిలీపై సిరోలు వెళ్లడంతో గార్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న స్వాతి బిందు ఇక్కడికి బదిలీపై వచ్చారు. దమ్మపేట ఎంపీడీవోగా రవీంద్రరెడ్డి బదిలీపై వచ్చారు. దమ్మపేట తహసీల్దార్ ముజాహిద్ బూర్గంపహడ్ బదిలీ కాగా, కల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న కారుమండి శ్రీనివాసరావు దమ్మపేట తహసీల్దార్‌గా నియమితులయ్యారు. చంద్రుగొండ తహసీల్దార్‌గా గుర్రం జగదీశ్వరావు, ఎంపీడీవోగా బయ్యవరపు అశోక్ బాధ్యతలు చేపట్టారు. ఇల్లెందు ఎంపీడీవోగా కె.ధన్‌సింగ్ బాధ్యతలు చేపట్టారు. టేకులపల్లి తహసీల్దార్‌గా ఎన్ నాగభవాని, ఎంపీడీవోగా జి.రవీంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కొండపల్లి కృష్ణవేణి, ఎంపీడీవో కె.వీరబాబు మహబూబాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. అన్నపురెడ్డిపల్లి ఎంపీడీవోగా మహాలక్ష్మీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎంపీడీవో అన్నపూర్ణ వీఎం బంజర్‌కు బదిలీపై వెళ్లారు. పాల్వంచ తహసీల్దార్‌గా వివేక్, ఎంపీడీవోగా విజయభాస్కర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట తహసీల్దార్‌గా ఉన్న వివేక్, ఖమ్మం జిల్లా కారేపల్లి ఎంపీడీవోగా ఉన్న విజయభాస్కర్‌రెడ్డి బదిలీపై పాల్వంచకు వచ్చారు. బూర్గంపహాడ్ తహసీల్దార్‌గా ముజాహిద్ బుధవారం విధుల్లో చేరారు. ఆయన దమ్మపేట నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ తిరుమలాచారి.. కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడి ఎంపీడీవో నంబూరి వివేక్‌రామ్.. మహబూబాబాద్ జిల్లా దంతెలబోరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నేలకొండపల్లి ఎంపీడీవో జమలారెడ్డి వచ్చారు. ఆయన కూడా బుధవారం విధుల్లో చేరారు. పినపాక ఎంపీడీవోగా రాఘవరపు రామకృష్ణ బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడి ఎంపీడీవో చంద్రశేఖర్.. కల్లూరుకు బదిలీ అయ్యారు.

డీపీవోను కలిసిన ఎంపీవోలు

చుంచుపల్లి, ఫిబ్రవరి 14 : జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా బాధ్యతలు స్వీకరించిన చంద్రమౌళిని బుధవారం ఎంపీవోల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీపీవోను కలిసిన వారిలో మన్నె శ్రీనివాసరావు, గుంటి సత్యనారాయణ, ఖాన్, నారాయణ, కుమార్ ఉన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చుంచుపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని పెనుబల్లి పంచాయతీలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేల్పుల మల్లేష్ సోదరుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, దాము పాల్గొన్నారు.

అమరులైన జవాన్లకు నివాళి

నివాళి అర్పిస్తున్న పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారులు

చర్ల, ఫిబ్రవరి 14: పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు బుధవారం గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు, పోలీస్-సీఆర్పీఎఫ్ అధికారులు నివాళులర్పించారు. సీఐ రాజువర్మ, ఎస్సైలు టీవీ ఆర్ సూరి, నర్సిరెడ్డి, గురుదేవ్ విద్యాలయం హెచ్ఎం హెచ్‌జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

బహుమతులు అందిస్తున్న ఎంపీపీ, అధికారులు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 14: చెడు వ్యవనాలకు యువత దూరంగా ఉండాలని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి సూచించారు. క్రీడల ప్రాధాన్యతను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. పేరాయిగూడెం పంచాయతీలో బుధవారం పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, ఎంపీవో సీతారామరాజు, పంచాయితీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్‌పై 19న అవిశ్వాసం

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి తెరలేపారు. గత నెలలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొంతమంది 22మందితో సంతకాలు చేయించి ఆ లేఖను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో కలెక్టర్ ఈ నెల 19న అవిశ్వాస తీర్మాన సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెండు వర్గాలుగా మారిన కౌన్సిలర్లు వేర్వేరు ప్రాంతాల్లో క్యాంపులకు తరలివెళ్లారు. దీంతో కొత్తగూడెం రాజకీయ ఒరసవత్తరంగా మారింది.

మిర్చి కాంటాలో మోసం..

వ్యాపారులకు దేహశుద్ధి చేసిన రైతులు

దళారుల చేతిలో మోసపోయిన రైతులు

చంద్రుగొండ, ఫిబ్రవరి 14: మిర్చి రైతులను మోసం చేసిన వ్యాపారులకు దేహశుద్ధి చేసిన ఘటన బుధవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకున్నది. బాధిత రైతులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.... బెండాలపాడు పంచాయతీకి చెందిన 8మంది రైతుల నుంచి 25క్వింటాళ్ల 53 కేజీలు ఎలక్ట్రానిక్ కాంటాల ద్వారా తల్లాడ మండలానికి చెందిన వ్యాపారులు రాంబాబు, దస్తగిరి కొనుగోలు చేశారు. క్వింట రూ.19వేల నుంచి 19,500లు వరకు ధర పెట్టి కొనుగోలు చేశారు. వీటిని రెండు వ్యానుల్లో బస్తాల్లో మిరపకాయలు లోడ్ చేసి, తీసుకెళ్తుండగా రైతులకు అనుమానం వచ్చి దామరచర్ల వేబ్రిడ్జి కాంటా వద్ద మిరప బస్తాలను తూకం వేయగా 31.10క్వింటాలు బరువు వచ్చాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన రైతులు బస్తాలను అదే వ్యానుల్లో బెండాలపాడుకు తీసుకువచ్చి సదరు వ్యాపారులను చితకబాదారు. దీంతో అక్కడకు వచ్చిన తోటి రైతులు, గ్రామస్తులు కలిసి బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరగకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత రైతులు తేజావత్ బాబు, బానోత్ బాలు, వర్సా వీరభద్రం, తేజావత్ సురేశ్, బోడా శ్రీను, గోగుల తిరుమలరావు, రాయల రాజేశ్, చింతల సుబ్బారావు తెలిపారు. తల్లాడ మండలానికి చెందిన వ్యాపారులను చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామానికి చెందిన మరో దళారి ద్వారా గత కొన్నాళ్లుగా రైతులను మోసం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయమై ఎస్సై మాచినేని రవిని వివరణ కోరగా.. జరిగిన విషయంపై పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. సాయంత్రానికి వ్యాపారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సమ్మక్క- సారలమ్మ చిన్నజాతర ప్రారంభం

గద్దెల మీదకు చేరిన పుట్టబంగారం, సారలమ్మ

గద్దెల మీదికి సారలమ్మ, పుట్ట మట్టి తీసుకొస్తున్న పూజారులు

జూలూరుపాడు, ఫిబ్రవరి 14: మినీ మేడారంగా ప్రసిద్ధి చెందిన పడమటనర్సాపురం గ్రామ సమీపంలోని సమ్మక్క-సారలమ్మల జాతర ఆదివాసీ గిరిజన ఆచార సంప్రదాయాల నడుమ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. గిరిజన పూజారులు గ్రామం నుంచి ఆదివాసీ డప్పు నృత్యాలు, శివసత్తుల పూనకాల నడుమ ర్యాలీగా పూజా సామగ్రితో గద్దెల వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. అనంతరం గద్దెల ప్రాంతం, చుట్టుపక్కల కొర్రులు నాటారు. పుట్ట బంగారాన్ని ఆదివాసీ పూజారులు అడవినుంచి తీసుకొచ్చి గద్దెల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వనం నుంచి సారలమ్మను జనసందోహం నడుమ గద్దెల మీదకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. జాతర ప్రాంతంలో స్థానిక ప్రభుత్వ వైద్యులు వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవార్లకు బంగారం(బెల్లం), మేకలు, కోళ్లు, పాల పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. స్నానఘట్టాల వద్ద స్నానాలు ఆచరించి తలనీలాలను సమర్పించారు. జాతరకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని జాతర నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. జాతరలో మిఠాయిలు, బొమ్మల దుకాణాలు, కోళ్ల షాపులు, బంగారం(బెల్లం) గాజుల దుకాణాలు వెలిశాయి. ఆదివాసీ పూజారులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తగూడెంలో ఇద్దరు బంగ్లాదేశ్ యువకులు

అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 14: బంగ్లాదేశ్‌కు చెందిన ఇద్దరు యువకులు అక్రమంగా చొరబడి కొత్తగూడెంలో అనధికారికంగా నివాసం ఉండడంతో గుర్తించిన త్రీటౌన్ పోలీసులు బుధవారం వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కొత్తగూడెం పట్టణంలోని గణేశ్ టెంపుల్ ఏరియాలో ఇద్దరు బంగ్లాదేశ్‌కి చెందిన యువకులు అక్రమంగా చొరబడి నివాసం ఉంటున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సదరు యువకులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారి నుంచి స్పష్టమైన సమాచారాన్ని సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. రెండేళ్ల క్రితమే వారు ఇక్కడికి వచ్చారని, అప్పటి నుంచి ఖమ్మం, కొత్తగూడెంలో తలదాచుకుంటున్నట్లు ప్రాథమికంగా తేలింది. పూర్తి వివరాలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

టేకులపల్లి, ఫిబ్రవరి 14 : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నూతన సీఐ తాటిపాముల సురేశ్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన సీఐగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని టేకులపల్లి, బోడు, ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో మాదక ద్రవ్యాలైన గంజాయి, గుడుంబా రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎస్సైగా సైదా రవూఫ్, బోడు ఎస్సైగా పి.శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు.

అశ్వారావుపేట, ఫిబ్రవరి 14 : మండలంలో శాంతి భద్రతలను ప్రజల భాగస్వామ్యంతో పరిరక్షిస్తామని ఎస్సై ఎస్.శ్రీను అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులను ఉపేక్షించేది లేదని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

భద్రాచలం సీఐగా రాయల

భద్రాచలం, ఫిబ్రవరి 14: పట్టణ సీఐగా రాయల వెంకటేశ్వరరావు మంగళవారం విధుల్లో చేరారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. శాంతి, భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 14 : ఇల్లెందు పీఏసీఎస్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు బండారి శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం రాజీనామా పత్రాన్ని జిల్లా సహకార సంఘం సీఈవోకు అందజేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 14: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారికి అర్చకులు బుధవారం నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

రహదారులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 14: మండలంలోని మారాయిగూడెం, కొత్తపల్లి పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద రోడ్లకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బుధవారం శంకుస్థాపన చేశారు. కొత్తపల్లి ఆశ్రమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు నియామక పత్రాలు అందజేత

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14: బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ, మైనార్టీ శాఖల్లో జూనియర్ లెక్చరర్లు, పీజీటీలు, లైబ్రరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లుగా ఎంపికైన 61 మంది అభ్యర్థులకు ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఆర్వో రవీంద్రనాథ్, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, బీసీ గురుకుల జిల్లా కన్వీనర్ బ్యూలారాణి, ఎస్సీ రీజినల్ కో ఆర్డినేటర్ ప్రత్యూష, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూయ పాల్గొన్నారు.

5కేఎం ట్రాక్, చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 14: చాతకొండ 6వ బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన 5కేఎం ట్రాక్, చిల్డ్రన్‌పార్కు, త్రీ ఫ్యాబ్రికేటెడ్ మారక్‌ను బెటాలియన్ ఏడీజీపీ స్వాతి లక్ర, ఐజీపీ రమేశ్ వర్చువల్ పద్ధతిలో బుధవారం ప్రారంభించారు. ఎస్పీ రోహత్ రాజు, బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, అదనపు కమాండెంట్ అంజయ్య, ఏవో వెంకటేశ్వర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, జూ.అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రారంభ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 14 : రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలతో ప్రతి వాహనదారుడు చైతన్యవంతం కావాలని, భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎస్పీ బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 1,355 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నియమాలను ఉల్లంఘించిన వారి 2,922 వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 40,915 ఈ-చలాన్ కేసుల్లో రూ.80,78,385 జరిమానా విధించామన్నారు.

విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 14: విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని డివిజనల్ పంచాయతీ అధికారి, మేజర్ పంచాయతీ ప్రత్యేక అధికారి రాజీవ్ కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని వార్డుల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా పనులను పరిశీలించారు. డీఎల్‌పీవోతోపాటు ఎంపీవో సీతారామరాజు, ఈవో గజవెల్లి హరికృష్ణ ఉన్నారు.

సర్వదేవతా సన్నిధానంలో అక్షరాభ్యాసాలు

భద్రాచలం, ఫిబ్రవరి 14: పట్టణంలోని శిల్పినగర్‌లోగల శ్రీ దుర్గాగాయత్రి సర్వదేవతా సన్నిధానంలో అర్చకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ వ్యవస్థాపకులు కేవీ సుబ్రహ్మణ్య శర్మ, వెంకటేశ్వరరావు, సరోజిని, లీలావతి, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

పెద్దమ్మగుడిలో అక్షరాభ్యాసం

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీపంచమి సందర్భంగా బుధవారం బాలలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అదేవిధంగా పాల్వంచ డీఎస్పీగా నూతన బాధ్యతలు స్వీకరించిన లింగబోయిన ఆదినారాయణ పెద్దమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు.

కారు దగ్ధం

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 14 : నిజాంపేట సమీపంలో కారు దగ్ధమయింది. బుధవారం మండలంలోని ముకుందాపురానికి చెందిన కురుస రాంబాబు కారులో వెళ్తుండగా అదే రహదారిలో ఆర్టీసీ బస్సు రావడంతో రెండు ఢీ కొన్నాయి. రాంబాబు కారును ప్రక్కకు నిలిపి ఆర్టీసీ డ్రైవర్‌తో మాట్లాడుతుండగా కారులో అకస్మాత్తుగా పొగలు వచ్చి క్షణాల్లోనే కారు దగ్ధమైందని స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో వ్యక్తి హత్య

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 14: పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతో ఓ వ్యక్తిని అపహరించిన మావోయిస్టులు గొంతుకోసి హత్య చేశారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో బుధవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సుక్మా జిల్లా పోలంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలమడుగు గ్రామానికి చెందిన పొడియం జోగా అనే వ్యక్తి దోర్నపాల్ నగర పంచాయతీ పరిధిలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఇతడు పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడనే నెపంతో గ్రామం నుంచి కిడ్నాప్ చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం గొంతుకోసి హత్య చేశారు. మృతదేహాన్ని భేజ్జీ ఠాణా పరిధిలోని ఓ గ్రామ సమీపంలో రోడ్డుపై పడేసి వెళ్లిపోయారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వన్యప్రాణులను వేటాడితే కేసులు

పినపాక, ఫిబ్రవరి 14: వన్యప్రాణులను వేటాడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని హెచ్చరించారు. మండలంలోని వలస ఆదివాసీ గ్రామాల్లో బుధవారం అటవీ అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వన్యప్రాణులను చంపితే ఎలాంటి శిక్షలు పడతాయో వివరించారు. అడవి జంతువుల వేటగాళ్ల సమాచారం ఇవ్వాలని కోరారు. ఇలా సమాచారం ఇచ్చిన వారి వివరాలరను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. డీఆర్‌వో అరుణ పాల్గొన్నారు.

ఇంజినీర్ల సంఘం ఆవిర్భావ దినోత్సవం

పాల్వంచ, ఫిబ్రవరి 14 : తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ 8వ ఆవిర్భావ దినోత్సవాన్ని పాల్వంచలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెన్కో డైరెక్టర్ (థర్మల్) లక్ష్మయ్య పాల్గొని డైరీని ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అసోసియేషన్ ఫౌండర్ సవీర్ అహ్మద్, ఉమారావు, వినోద్‌కుమార్, క్రాంతికుమార్, రామకృష్ణారెడ్డి, హరీష్ పాల్గొన్నారు.